దక్షిణ కొరియా రచయిత్రి హాన్ కాంగ్‌కు నోబెల్

సాహిత్యంలో దక్కిన ప్రతిష్ఠాత్మక పురస్కారం

స్టాక్‌హోమ్: దక్షిణ కొరియాకు చెందిన రచయిత్రి హాన్ కాంగ్‌కు సాహిత్యంలో నోబెల్ పురస్కారం దక్కింది. ఈ మేరకు గురువారం స్వీడిష్ అకాడమీ నోబెల్ కమిటీ ప్రకటించింది. 'చారిత్రక విషాదాలను, మానవ జీవిత దుర్బలత్వాన్ని ఆమె తన గద్య కవిత్వంతో కళ్లకు కట్టారు' అని పేర్కొన్నది. హాన్ కాంగ్(53) 'ది వెజిటేరియన్' అనే నవలకు గానూ 2016లో అంతర్జాతీయ బుకర్ ప్రైజ్‌ను గెలుపొందారు. ఆమె మరో నవల 'హూమన్ యాక్ట్స్' 2018లో బుకర్ ప్రైజ్ పోటీలో ఫైనల్‌కు చేరింది. కాగా, సాహిత్యంలో నోబెల్ పురస్కారాలు ఎక్కువగా ఐరోపా, ఉత్తర అమెరికా రచయితలకే దక్కుతున్నాయనే విమర్శలు ఇంతకాలం ఉండేవి. ఇందులోనూ మగవారి ఆధిపత్యం ఉంటున్నదని, ఇప్పటివరకు 119 మందికి ఈ పురస్కారం దక్కగా, ఇందులో మహిళలు కేవలం 17 మంది మాత్రమే ఉన్నారు. హన్ కాంగ్‌ను ఈ ఏడాది పురస్కారానికి ఎంపిక చేయడం ద్వారా ఈ విమర్శలకు నోబెల్ కమిటీ చెక్ పెట్టినట్టయ్యింది. నోబెల్ పురస్కారం కింద హన్ కాంగ్‌కు రూ.8.4 కోట్లు దక్కనున్నాయి. డిసెంబరు 10న ఆమె ఈ పురస్కారాన్ని అందుకుంటారు.

యూపీలో దళిత బాలురపై దాష్టీకం

- చోరీ నెపంతో ముగ్గురికి శిరోముండనం
- ముఖంపై నల్లరంగు పులిమి ఊరేగింపు

భరూచ్, అక్టోబర్ 10: బీజేపీ పాలిత యూపీలో దళితులపై మరో దారుణం చోటుచేసుకుంది. దొంగతనం చేశారన్న అనుమానంతో ఇద్దరు కోళ్ల ఫారం యజమానులు దాష్టీకానికి దిగారు. ముగ్గురు దళిత బాలురను కొట్టి, వారికి గుండు గీయించి, ముఖానికి నల్లరంగు పులిమి గ్రామంలో ఊరేగించారు. ఈ దారుణం యూపీలోని భరూచ్ జిల్లా తాజ్‌పూర్ తెడియా గ్రామంలో మంగళవారం జరిగింది. 5 కిలోల గోధుమలు అపహరించారని ఆరోపిస్తూ 12-14 ఏండ్ల వయసున్న ముగ్గురు బాలురను కోళ్లఫారాల యజమానులు నజీమ్, ఖాసింలు దారుణంగా కొట్టారు. అంతటితో ఆగకుండా వారికి శిరోముండనం చేయించారు. ముఖానికి నల్ల రంగు పూశారు. రెండు చేతులు కట్టేసి, ముంజేతులపై 'దొంగ' అని రాసి గ్రామంలో ఊరేగించారు. ఈ ఘటనను వీడియో కూడా తీశారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ముగ్గురిని అరెస్ట్ చేయగా, మాజీ గ్రామ పెద్ద పరారీలో ఉన్నాడు. ముందు జాగ్రత్త చర్యగా గ్రామంలో పోలీసు బలగాలను మోహరించారు.

ఢిల్లీలో మరో 2,000 కోట్ల కొకైన్ పట్టివేత

గత వారం రూ.5,600 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

న్యూఢిల్లీ, అక్టోబర్ 10: దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. రూ.2,000 కోట్ల విలువైన 200 కిలోల కొకైన్‌ను రమేశ్ నగర్‌లో ఢిల్లీ పోలీసులకు చెందిన ప్రత్యేక బృందం స్వాధీనం చేసుకుంది. గత వారమే ఢిల్లీలో రూ.5,600 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో వారంలోనే ఢిల్లీలో మొత్తంగా రూ.7,500 కోట్ల విలువైన 762 కిలోల డ్రగ్స్ పట్టుబడింది. విశ్వసనీయ సమాచారంతో డ్రగ్స్ సప్లయర్‌ను జీపీఎస్ ద్వారా ట్రాక్ చేసిన పోలీసులు రమేశ్‌నగర్‌లో దాడి జరిపి భారీ మొత్తంలో కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు లండన్‌కు పారిపోవడానికి ప్రయత్నించాడని, అయితే అతడి ప్రయత్నాన్ని పోలీసులు భగ్నం చేశారని అధికారులు తెలిపారు. ఈ కొకైన్ స్మగ్లింగ్ వెనుక అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా ఉందని చెప్పారు.

రతన్.. ఇక సెలవు!

- పారిశ్రామిక దిగ్గజం, దాతృశీలి రతన్ టాటాకు కన్నీటి వీడ్కోలు
- ముంబైలోని వర్లీ శ్మశానవాటికలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- భారీగా హాజరైన ప్రముఖులు, ప్రజలు

ముంబై, అక్టోబర్ 10: పారిశ్రామిక దిగ్గజం, దాతృశీలి రతన్ టాటా అంత్యక్రియలు గురువారం సాయంత్రం ముగిశాయి. వొర్లిలోని శ్మశానవాటికలో అధికారిక లాంఛనాలతో ఆయనకు తుది వీడ్కోలు పలికారు. ముందుగా ఆయన పార్థివదేహాన్ని ప్రజల సందర్శణార్థం ముంబైలోని నారిమన్ పాయింట్ వద్ద ఉన్న ఎన్‌సీపీఏ గ్రౌండ్‌కు తరలించారు. వివిధ రంగాల ప్రముఖులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై రతన్ టాటాకు నివాళులర్పించారు. సర్వమత ప్రార్థనల అనంతరం శ్మశానవాటికకు ఆయన పార్థివదేహాన్ని తరలించారు. రతన్ టాటా అంత్యక్రియల్లో కేంద్రమంత్రులు అమిత్ షా, పీయూశ్ గోయల్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, మాజీ ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ షిండే, టాటా కుటుంబసభ్యులు, టాటా గ్రూప్ ప్రముఖులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ దహనవాటికలో అంత్యక్రియలు

రతన్ టాటా పార్శీ మతస్థుడు. సాధారణంగా పార్శీ మతానికి చెందిన వారు మృతదేహాలను ఖననం, దహనం చేయరు. నీరు, గాలి, భూమిని పార్శీలు పవిత్రంగా చూస్తారు. మృతదేహాలను ఖననం, దహనం చేయడం ద్వారా ఇవి కలుషితం అవుతాయని భావిస్తారు. అందుకే, రాబందులు, డేగలు వంటి పక్షులు తినేందుకు వీలుగా మృతదేహాన్ని దఖ్మా అని పిలిచే ప్రదేశంలో వదిలిపెడతారు. మరణించినా పక్షులకు ఆహారంగా మారాలనే ఆలోచనతో ఈ ఆచారాన్ని పాటిస్తున్నారు. అయితే పర్యావరణ మార్పులు, రాబందుల సంఖ్య తగ్గిపోవడంతో విద్యుత్ దహన వాటికల్లో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. టాటా అంత్యక్రియలు కూడా ఎలక్ట్రిక్ విధానంలోనే పూర్తయ్యాయి.

గుడ్‌బై మై లైట్‌హౌజ్

రతన్ టాటాకు చివరి దశలో అత్యంత ఆత్మీయుడిగా మెలిగిన శంతను నాయుడు అనే యువకుడు సోషల్ మీడియా ద్వారా తన భావోద్వేగాన్ని పంచుకున్నారు. 'మీ స్నేహం ఇప్పుడు నాకు మిగిల్చిన వెలితిని జీవితాంతం పూడ్చడానికి ప్రయత్నిస్తాను. గుడ్ బై, మై డియర్ లైట్‌హౌజ్' అని ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శంతను ప్రస్తుతం రతన్ టాటా కార్యాలయంలో పని చేస్తున్నారు.

నాలుగు సార్లు పెండ్లి వరకు వచ్చినా...

రతన్ టాటా అవివాహితుడు. అయితే తాను నాలుగుసార్లు వివాహానికి చేరువై వెనక్కు వెళ్లినట్టు 2011లో సీఎన్ఎన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. ప్రతిసారీ ఏదో కారణం చేత వివాహ ఆలోచన నుంచి వెనక్కి తగ్గినట్టు చెప్పారు. ప్రస్తుతం ప్రజలతో మమేకమై ఉన్న తాను వెనక్కి చూసుకుంటే తాను తీసుకున్న నిర్ణయం తప్పు కాదని అర్థమైందన్నారు. తాను వివాహం చేసుకుని ఉంటే జీవితంలో సంక్లిష్టతలను ఎదుర్కొని ఉండేవాడినే మోనని టాటా వ్యాఖ్యానించారు. కాగా, తాను అమెరికాలో ఉన్నప్పుడు ఒక యువతితో గాఢమైన ప్రేమలో పడ్డానని రతన్ టాటా చెప్పారు. అప్పట్లో తాను భారత్‌కు తిరిగి రాగా, ఆమె 1962 నాటి చైనా-భారత్ యుద్ధం కారణంగా రాలేకపోయిందని తెలిపారు.

జంతువుల పట్ల ఆత్మీయత

రతన్ టాటా హృదయంలో జంతువులకు, ముఖ్యంగా శునకాలకు ప్రత్యేక స్థానం ఉండేది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడుతున్న వీధి కుక్కలను రక్షించేందుకు శంతను నాయుడు, అతడి స్నేహితుడు వాటికి రిఫ్లెక్టివ్ కాలర్లను అమర్చడానికి మొటోపాస్ అనే ప్రాజెక్ట్ చేపట్టారు. ఈ ప్రాజెక్ట్ గురించి శంతను రతన్ టాటాకు లేఖ రాయగా.. ఆయన ఈ ప్రాజెక్ట్ 11 నగరాల్లో అమలయ్యేలా సహాయం చేశారు. రతన్ టాటా దాతృత్వ సేవలకు గుర్తింపుగా 2018లో జీవితకాల సాఫల్య పురస్కారాన్ని స్వీకరించాల్సిందిగా ఇంగ్లండ్ రాజకుటుంబం ఆహ్వానించింది. అయితే తన పెంపుడు కుక్క తీవ్ర అనారోగ్యం కారణంగా ఆయన తన ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. టాటా గ్రూప్ ప్రధాన కార్యాలయం బాంబే హౌస్‌లోనూ కుక్కలను సంరక్షించేవారు. 2023లో తన పెంపుడు కుక్కను శస్త్ర చికిత్స కోసం ఆయన విదేశాలకు తీసుకెళ్లాల్సి వచ్చింది. ఆ తర్వాత భారత్‌లో అత్యాధునిక పశు వైద్యశాల అవసరమని భావించి అందుకోసం రూ.165 కోట్ల విరాళమిచ్చారు.

వర్లీ శ్మశాన వాటికకు రతన్ టాటా పార్థివ దేహాన్ని తీసుకొస్తున్న పోలీసులు

ఆర్థిక ప్రగతికి మానవత్వాన్ని అద్దారు: కేసీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): రతన్ టాటా మరణం పట్ల తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు సంతాపం ప్రకటించారు. పారిశ్రామిక ప్రగతికి మానవీయ కోణాన్ని అద్దిన మానవతావాది, దార్శనికుడు, పరోపకారి రతన్ టాటా అని కొనియాడారు. అభివృద్ధి ఫలాలు కింది స్థాయికి చేరుకోవాలనే సామాజిక, ఆర్థిక తాత్విక తను సొంతం చేసుకున్న అరుదైన పారిశ్రామికవేత్త రతన్ టాటా అని పేర్కొన్నారు. ఆర్థిక ప్రగతికి మానవత్వాన్ని అద్దిన అరుదైన పారిశ్రామికవేత్త అని శ్లాఘించారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఒక కార్యక్రమానికి హాజరై, నూతన తెలంగాణ రాష్ట్రం అనతికాలంలో సాధిస్తున్న అభివృద్ధిని అభినందించడం, సాంకేతిక, పారిశ్రామిక రంగాల్లో అమలు చేసిన దార్శనిక కార్యాచరణ పట్ల వారు ఆనందాన్ని వ్యక్తం చేయడం తెలంగాణకు గర్వకారణమని కేసీఆర్ స్మరించుకున్నారు. రతన్ టాటా మృతి బాధాకరమని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. దూరదృష్టి, నాయకత్వం, దాతృత్వంతో ఆయన చెరగని ముద్ర వేశారని, భవిష్యత్ తరాల్లో స్ఫూర్తి నింపారని అన్నారు.

టాటాను వదలని పెంపుడు కుక్క

రతన్ టాటా పార్థివదేహాన్ని ఆయన పెంపుడు కుక్క 'గోవా' వదలిపెట్టలేకపోయింది. ఆయన దేహం వద్దనే అది బాధతో తిరుగుతూ ఉండటం అక్కడున్న వారిని కలిచివేసింది. పదేండ్ల క్రితం గోవా నుంచి ఈ వీధి కుక్కను ఆయన తనతో తెచ్చుకొని పెంచుతున్నారు. ఈ కుక్క అంటే టాటాకు చాలా ఇష్టమని దాని సంరక్షకుడు తెలిపారు.

జమిలి ఎన్నికలు వద్దు

కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

తిరువనంతపురం: దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించడానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను కేరళ ప్రభుత్వం వ్యతిరేకించింది. ఇది అప్రజాస్వామ్యం, రాజ్యాంగ విరుద్ధమంటూ పేర్కొంది. ఒకే దేశం-ఒకే ఎన్నిక నినాదంతో దేశంలో ఏకకాలంలో అన్ని ఎన్నికలు జరపాలంటూ కోవింద్ కమిటీ చేసిన సిఫార్సులను కేంద్రం ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ కేరళ అసెంబ్లీ గురువారం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ తరపున మంత్రి ఎంబీ రాజేశ్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ అజెండాకు అనుకూలంగానే దీనిని అమలు చేయడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని రాజేశ్ విమర్శించారు.

మెకానిక్‌కు రూ.25 కోట్ల లాటరీ

కర్ణాటక వాసిని వరించిన అదృష్టం

బెంగళూరు, అక్టోబర్ 10: కర్ణాటకకు చెందిన ఒక మెకానిక్ రాత్రికి రాత్రే కోటీశ్వరుడయ్యాడు. మాండ్య జిల్లాకు చెందిన అల్తాఫ్ కేరళ లాటరీలో రూ.25 కోట్లను గెల్చుకున్నాడు. కేరళకు చెందిన తిరువోణం బంపర్ లాటరీ ప్రతి ఏడాది పెద్ద మొత్తంలో ప్రైజ్ మనీ ఇస్తుంది. గత 15 ఏండ్లుగా తాను లాటరీ టికెట్లు కొంటున్నానని, ఇన్నాళ్లకు తనను అదృష్టం వరించిందిని అల్తాఫ్ తెలిపాడు. ప్రైజ్ మనీ తీసుకోవడానికి వచ్చిన ఆయన మాట్లాడుతూ వయనాడ్‌లో ఉన్న తన చిన్ననాటి స్నేహితుడిని చూసేందుకు అప్పుడప్పుడు వెళ్తుంటానని, వెళ్లినప్పుడల్లా లాటరీ టికెట్‌ను కొనేవాడినని చెప్పాడు. వివిధ పన్నులన్నీ పోను లాటరీ విజేతకు సుమారు రూ.13 కోట్లు వస్తాయని నిర్వాహకులు తెలిపారు.

హిజ్బ్-ఉత్-తహ్రీర్‌పై కేంద్రం నిషేధం

న్యూఢిల్లీ, అక్టోబర్ 10: 'హిజ్బ్-ఉత్-తహ్రీర్' సంస్థను కేంద్రం ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. అంతే కాకుండా, దానిని దేశంలో నిషేధిస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇస్లామిక్ రాజ్య స్థాపనే ధ్యేయంగా 1953లో జెరూసలేంలో స్థాపించిన ఈ సంస్థ భారత్‌లో యువతను తీవ్రవాదం వైపు నడిచేలా ప్రేరేపిస్తున్నదని, వారిని ఉగ్రవాద సంస్థల్లో చేరేలా ఒత్తిడి తెస్తున్నదని కేంద్రం ఆరోపించింది.ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించడానికి దీనికి ఐసిస్ లాంటి సంస్థలు ఆర్థిక సహాయం అందజేస్తున్నాయని తెలిపింది.

ఇజ్రాయెల్ దాడిలో 27 మంది మృతి

డెయిర్ అల్-బలహ్, అక్టోబర్ 10: గాజా స్ట్రిప్‌లో షెల్టర్‌గా వాడుతున్న ఓ స్కూల్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 27 మంది మరణించారని పాలస్తీనా వైద్యాధికారులు గురువారం తెలిపారు. డెయిర్ అల్-బలహ్‌లో జరిగిన ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. అయితే పౌరులు వెనుక దాక్కొన్న మిలిటెంట్లను లక్ష్యంగా చేసుకొని తాము దాడి చేశామని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఆ స్కూల్‌లో మిలిటెంట్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నిర్వహిస్తున్నారని ఆరోపించింది. గాజాల్లోని పాఠశాలలు మిలిటెంట్లకు ఆశ్రయాలుగా మారుతున్నాయని.. అందుకే వాటిపై మళ్లీ మళ్లీ దాడులు చేస్తున్నామని తెలిపింది. సాధారణంగా భద్రత కల్పించే హమాస్ పోలీసులుండే గదిలో సహాయ బృంద ప్రతినిధితో స్కూల్ మేనేజర్లు సమావేశమైనప్పుడు ఈ దాడి జరిగిందని... దాడి సమయంలో అక్కడ పోలీసులు ఎవరూ లేరని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

50 ఏండ్లలో 73% తగ్గిన వన్యప్రాణుల సంఖ్య

న్యూఢిల్లీ: పర్యావరణ సమతూకాన్ని కాపాడే వన్యప్రాణుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్నది. గత 50 ఏండ్లలో వీటి సంఖ్య సగటున 73 శాతం తగ్గిపోయినట్టు వరల్డ్ వైల్డ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) విడుదల చేసిన లివింగ్ ప్లానెట్ నివేదిక పేర్కొంది. భూమిపై జంతుజాతులు, పర్యావరణ వ్యవస్థలు క్షీణిస్తూనే ఉన్నాయని వెల్లడించింది. లివింగ్ ప్లానెట్ ఇండెక్స్ (ఎల్‌పీఐ) వార్షిక నవీకరణ ప్రకారం 1970-2020 మధ్య పర్యవేక్షించిన పక్షులు, క్షీరదాలు, ఉభయచరాలు, చేపలు, సరీసృపాల పరిమాణం ప్రపంచ స్థాయిలో సగటున 73 శాతం తగ్గింది. మున్ముందు ఈ క్షీణత మరింత వేగంగా ఉంటుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

కాంగ్రెస్‌ను ఇక మోయలేం

- మా బలంతో ఆ పార్టీ లాభపడుతున్నది
- ఆ పార్టీతో నష్టమే తప్ప లాభం లేదు
- ఇండియా కూటమి అభిప్రాయం
- కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పేందుకు సిద్ధం
- ఒంటరిపోరుకు దిగుతున్న ఆప్, ఎస్పీ
- మిగతా ప్రాంతీయ పార్టీలదీ ఇదే దారి

న్యూఢిల్లీ, అక్టోబర్ 10: ఇండియా కూటమిలో చిచ్చు రేగింది. హర్యానా, జమ్ము కశ్మీర్ ఎన్నికల ఫలితాలు కూటమిని విచ్ఛిన్నం చేస్తున్నాయి. కాంగ్రెస్ తీరు పట్ల కూటమిలోని ప్రాంతీయ పార్టీలు మండిపడుతున్నాయి. ఆ పార్టీ పొత్తు ధర్మం పాటించకుండా, రాష్ట్రానికో నీతి అన్నట్టుగా వ్యవహరిస్తున్నదని ఆరోపిస్తున్నాయి. తమ బలంతో కాంగ్రెస్ లాభపడుతున్నదని, తమ భుజాలపై రాజకీయంగా ఊరేగుతున్నదే కానీ ఆ పార్టీతో పొత్తు వల్ల తమకు కలిగే ప్రయోజనం సున్నా అనే అభిప్రాయానికి వస్తున్నాయి. కాంగ్రెస్ అహంకారం, అతివిశ్వాసం వల్లే బీజేపీ ఒక్కో రాష్ట్రంలో గెలుస్తున్నదని భావిస్తున్నాయి. దీంతో ఒక్కో పార్టీ ఇండియా కూటమికి దూరం జరుగుతున్నాయి. కాంగ్రెస్‌ను ఇక మోయలేం అని చెప్తున్నాయి.

ప్రాంతీయ పార్టీల బలమే కాంగ్రెస్ పెట్టుబడి

కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఆదరణ కోల్పోతున్నదని, కేవలం తమ బలాన్ని ఉపయోగించుకొని మనుగడ సాధిస్తున్నదని ఇండియా కూటమిలోని ప్రాంతీయ పార్టీలు భావిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, బీహార్‌లో ఆర్జేడీ, తమిళనాడులో డీఎంకే, మహారాష్ట్రలో శివసేన(ఉద్ధవ్), ఎన్సీపీ(శరద్ పవార్) వంటి పార్టీలతో పొత్తు కాంగ్రెస్‌కు చాలా కలిసొచ్చింది. కాంగ్రెస్ సీట్ల సంఖ్య పెరగడానికి తమ బలమే కారణమని ప్రాంతీయ పార్టీలు భావిస్తున్నాయి. తాజాగా, జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ 56 సీట్లు పోటీ చేసి 42 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్‌కు 32 సీట్లు కేటాయిస్తే ఆరు స్థానాలను మాత్రమే గెలుచుకుంది. అది కూడా నేషనల్ కాన్ఫరెన్స్ బలంతో కశ్మీర్ ప్రాంతంలోనే ఐదు స్థానాలను గెలిచింది. ఇంత ప్రతికూల ఫలితాలు వచ్చినప్పటికీ ఇప్పుడు అధికారంలో కాంగ్రెస్ భాగమవుతున్నది. దీనిపై నేషనల్ కాన్ఫరెన్స్ అసంతృప్తిగా ఉంది.

కాంగ్రెస్‌కు దూరం.. దూరం

కాంగ్రెస్‌తో కలిసివెళ్తే బీజేపీని ఎదుర్కోలేమనే ఒక అభిప్రాయానికి ఇండియా కూటమిలోని ప్రాంతీయ పార్టీలు వస్తున్నాయి. కాంగ్రెస్ చేస్తున్న తప్పులు, ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పాలనా వైఫల్యాలు తమ మెడకు చుట్టుకొంటాయనే ఆందోళనతో ఉన్నాయి. ఇంకా కాంగ్రెస్‌తో పొత్తు అంటే మునిగిపోయే పడవలో ప్రయాణం చేయడమే అని భావిస్తున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ తీరుపై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇండియా కూటమి నుంచి ఆ పార్టీ దాదాపుగా తప్పుకున్నట్టే. ఢిల్లీలో ఆప్, యూపీ ఉప ఎన్నికల్లో సమాజ్‌వాదీ ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించాయి. ఆర్జేడీ, శివసేన సైతం కాంగ్రెస్ తీరు పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశాయి. దీంతో ఇండియా కూటమి అనే పేరు కొనసాగుతున్నప్పటికీ అందులో ఏయే పార్టీలు ఉన్నాయో కూడా చెప్పలేని పరిస్థితి ఉంది.

జమ్ముకశ్మీర్‌లో కాంగ్రెస్‌కు షాక్

జమ్ముకశ్మీర్‌లో కాంగ్రెస్‌కు షాక్ తగిలింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎన్సీ 42 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించి, కూటమి పార్టీలైన కాంగ్రెస్, సీపీఎం మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి పూర్తి మెజారిటీ సాధించింది. అయితే కూటమిలో ఆరు సీట్లతో ప్రధాన పార్టీగా ఉన్న కాంగ్రెస్‌కు ఇండిపెండెంట్లు షాకిచ్చారు. నలుగురు స్వతంత్రులు తాము ఎన్సీకి మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. దీంతో ఎన్సీ బలం 46కు చేరింది. దీంతో కాంగ్రెస్‌కు ప్రాధాన్యం తగ్గిపోయింది. భవిష్యత్తులో ఆ పార్టీ మద్దతు లేకుండానే ప్రభుత్వాన్ని కొనసాగించే బలం ఎన్సీకి ఏర్పడింది. మరోవైపు, ఎన్సీ శాసనసభాపక్ష నేతగా ఒమర్ అబ్దుల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మీ స్వార్థం వల్లే ఓడాం

హర్యానా కాంగ్రెస్ నేతలపై రాహుల్ గరం

న్యూఢిల్లీ, అక్టోబర్ 10: గెలుపు ఖాయమనుకున్న హర్యానాలో ఓటమిని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతున్నది. ఓటమికి కారణాలను విశ్లేషించడానికి గురువారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమీక్ష సమావేశం జరిగింది. రాహుల్ గాంధీతో పాటు హర్యానా ఎన్నికలకు పరిశీలకులుగా వ్యవహరించిన అజయ్ మాకెన్, అశోక్ గెహ్లోట్, దీపక్ బబారియా, కేసీ వేణుగోపాల్, హర్యానా కాంగ్రెస్ కీలక నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా హర్యానా కాంగ్రెస్ నేతలపై రాహుల్ గాంధీ తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారని తెలుస్తున్నది. ఈవీఎంల వల్లనే ఓడిపోయామని నేతలు చెప్పగా కౌంటింగ్, ఈవీఎంల విషయంలో ఎక్కడ తప్పులు జరిగాయో తనకు సమగ్ర నివేదిక ఇవ్వాలని నేతలకు ఆయన సూచించారు. 'మీరు స్వార్థపరులు. మీ గురించే ఆలోచించారే కానీ పార్టీ గురించి ఆలోచించలేదు. మీలో మీరు కొట్లాడుకొని పార్టీకి నష్టం చేశారు. లేదంటే మనం గెలిచే వాళ్లం' అంటూ రాహుల్ గాంధీ హర్యానా నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమావేశం నుంచి వెళ్లిపోయారని తెలుస్తున్నది. హర్యానాలో కాంగ్రెస్ కీలక నేతలు భూపిందర్ సింగ్ హుడా, కుమారి శెల్జా మధ్య ఆధిపత్య పోరు ఎన్నికల్లో ఆ పార్టీకి నష్టం చేసిందనే విశ్లేషణలు ఉన్నాయి.

కాంగ్రెస్‌తో పొత్తు లేకున్నా గెలిచేవాళ్లం

ప్రధాని మోదీని గౌరవిస్తాను: ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై నేషనల్ కాన్ఫరెన్స్ శాసనసభాపక్ష నేత ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌తో పొత్తు లేకపోయినప్పటికీ ఎన్నికల్లో తాము గెలిచేవాళ్లమని అన్నారు. ఓ జాతీయ మీడియా సంస్థతో ఆయన మాట్లాడుతూ... కేంద్రంతోనూ సామరస్యంగా వెళ్లాలనుకుంటున్నట్టు ఆయన చెప్పారు. కేంద్రంతో తమకు సమన్వయం అవసరమని, కేంద్రంతో కొట్లాట ద్వారా జమ్ము కశ్మీర్‌కు సంబంధించిన సమస్యలు పరిష్కారం కావని ఆయన పేర్కొన్నారు. మోదీని తాను గౌరవిస్తానని, జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇస్తామని ఆయన హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

తుఫాను ధాటికి సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో దెబ్బతిన్న ట్రోపికన ఫీల్డ్ పై కప్పు

ఫ్లోరిడాలో హిల్టన్ తుఫాన్ బీభత్సం

నలుగురు మృతి.. అంధకారంలో 30 లక్షల మంది

టంపా(యూఎస్), అక్టోబర్ 10: హెలెన్ తుఫాన్ సృష్టించిన బీభత్సం నుంచి కోలుకోకముందే అమెరికాపై మరో తుఫాన్ విరుచుకుపడింది. మిల్టన్ తుఫాన్ బుధవారం ఫ్లోరిడాను కుదిపేసింది. గంటకు 160 కి.మీ వేగంతో వీచిన గాలులు అనేక నగరాలను దెబ్బతీశాయి. టంపా నగరలో రికార్డు స్థాయిలో 41 సెం.మీ. వర్షపాతం నమోదు కావడంతో వరదలు పోటెత్తాయి. తుఫాన్ ధాటికి నలుగురు మృతిచెందారు. 30 లక్షల మందికి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. సెయింట్ పీటర్స్‌బర్గ్ నివాసితులకు నీటి సరఫరా ఆగిపోయింది. మిల్టన్ తుఫాను కారణంగా ఫ్లోరిడా తీరంలో వరదలు సంభవించాయి. దక్షిణ ఫ్లోరిడాను భారీ వర్షాలు, టోర్నడోలు బుధవారం నుంచి ముంచెత్తాయి. 15 కౌంటీల్లోని సుమారు 70 లక్షల మంది ప్రజలను తప్పనిసరిగా నివాసాలను ఖాళీ చేయాలని అధికారులు హెచ్చరించారు. తుఫాను కారణంగా 1900 విమానాలను రద్దు చేశారు. కాగా, పశ్చిమ ఫ్లోరిడాలో రెండు వారాల క్రితం హెలెన్ తుఫాన్‌కు 230 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

భారతీయ భోజన విధానం భేష్

- ప్రపంచం భారతీయులను అనుసరిస్తే.. ఈ భూగ్రహాన్ని కాపాడుకోవచ్చు
- డబ్ల్యూడబ్ల్యూఎఫ్ లివింగ్ ప్లానెట్ రిపోర్ట్

న్యూఢిల్లీ: భారతీయుల భోజన పద్ధతులు ఎంతో ఉత్తమమైనవని ప్రపంచ వన్యప్రాణి నిధి (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) లివింగ్ ప్లానెట్ నివేదిక వెల్లడించింది. అభివృద్ధి చెందిన (జీ20 దేశాలు) ఆర్థిక వ్యవస్థలన్నింటిలో భారతీయుల ఆహార వినియోగం అత్యంత సుస్థిరమైనదని గురువారం విడుదలైన ఆ నివేదిక అభిప్రాయపడింది. ప్రపంచ దేశాలన్నీ భారతీయ పద్ధతులను అనుసరిస్తే.. 2050 నాటికి ఆహార పదార్థాల ఉత్పత్తిలో భూ గ్రహానికి అత్యంత తక్కువ నష్టం వాటిల్లుతుందని సూచించింది. ఆర్జెంటీనా, ఆస్ట్రేలియా, అమెరికా వంటి దేశాల్లో ఆహార వినియోగ విధానాలు అత్యంత హీనంగా ఉన్నాయని, ఆయా దేశాల పద్ధతులు భూతాపాన్ని మరింత పెంచుతాయని హెచ్చరించింది. ఆహార వినియోగంలో ప్రపంచ దేశాలన్నీ అభివృద్ధి చెందిన దేశాల బాటలో నడిస్తే 2050 నాటికి భూతాపం పరిమితిని మించి పెరిగిపోతుందని తెలిపింది. ఆహార సంబంధిత ఉత్పత్తుల కారణంగా 2050 నాటికి వాతావరణం 1.5 డిగ్రీల సె